క్లుప్తంగా

నగరవనం, పిల్లల పార్కు లీజుకు

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరులోని అటవీశాఖ ఆధ్వర్యంలో ఉన్న నగర వనం, పిల్లల పార్కును లీజుకు ఇవ్వనున్నట్లు డీఎఫ్‌ఓ చైతన్య కుమార్‌రెడ్డి తెలిపారు. వాటి ప్రవేశ రుసుం వసూలు చేసి నిర్వహణ చూసుకోవాలన్నారు. ఆసక్తి గలవారు జిల్లా అటవీశాఖ కార్యాలయంలో ఈ నెల 27 తేదీలోపు సంప్రదించాలన్నారు. తదితరాలకు 08572–232458 నంబరును సంప్రదించాలన్నారు.

మరకాలకుప్పంలో వైద్యశిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ రష్మిత

గుడిపాల: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్‌తో ప్రజలకు ఇంటి వద్దే వైద్యం అందుతోందని బొమ్మసముద్రం పీహెచ్‌సీ డాక్టర్ రష్మిత అన్నారు. మరకాలకుప్పంలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలకు రక్త పరీక్షలు నిర్వహించారు. బీపీ, చక్కెర వ్యాధి గ్రస్తులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులకు వైద్యసేవలు అందజేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది శ్రీలక్ష్మి, యమున, శిల్ప, సుజిత, దేవి పాల్గొన్నారు.

హనుమంతునిపై శ్రీవారు



హనుమంత వాహనంలో శ్రీ వేంకటేశ్వరస్వామి

చిత్తూరు రూరల్: బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని చిత్తూరు నగరం ఈశ్వర గుడి వీధిలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం హనుమంత వాహనంపై ఊరేగారు. ఈ సందర్భంగా ఉదయం మూలస్థానంలోని స్వామివారికి అభిషేక పూజలు చేశారు. అనంతరం స్వామిని ప్రత్యేకంగా అలంకరించి హనుమంత వాహనంపై ఆశీనులు చేశారు. ఊరేగింపుగా వస్తున్న స్వామికి భక్తులు కర్పూర హారతులు పట్టారు.

ఇంటి స్థలాన్ని కబ్జా చేశారు

చిత్తూరు రూరల్: గన్‌మన్‌గా పనిచేస్తున్న వ్యక్తి తన ఇంటి స్థలాన్ని కబ్జా చేసేందుకు యత్నిస్తున్నట్లు గుడిపాల మండలం రాసనపల్లికి చెందిన ఈస్టర్ ఆరోపించారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. వల్లెప్పనగర్‌కు చెందిన శ్రీనివాస్ నుంచి తాను ఇంటి స్థలాన్ని కొనుగోలు చేశానన్నారు. ఈ స్థలం కొనుగోలు చేసేందుకు వెళితే గన్‌మన్ హరీష్ దౌర్జన్యం చేస్తున్నట్లు ఆరోపించారు. ఈ విషయంపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

గోమహత్యం పుస్తకావిష్కరణ



గోమహత్యం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నారాయణిఅమ్మ

బంగారుపాళెం: శ్రీపీఠం పీఠాధిపతి నారాయణి అమ్మ చేతులమీదుగా శనివారం గోమహత్యం పుస్తకాన్ని ఆవిష్కరించినట్లు ప్రముఖ పురోహితులు పాణ్యం శ్రీనివాసశర్మ తెలిపారు. ఆయన మాట్లాడుతూ, నారాయణి అమ్మ ఆదేశాల మేరకు గోమహత్యం పుస్తకం రచించినట్లు పేర్కొన్నారు. పుస్తకంలో గోమాత విశిష్టత, గోపూజ ఫలితాలు, ప్రాశస్త్యం గురించి వివరంగా పొందుపరిచినట్లు చెప్పారు.

క్రమం తప్పకుండా టీకాలు వేయాలి

యాదమరి: వైద్య సిబ్బంది గ్రామాల్లో క్రమం తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయాలని సంతగేటు ప్రభుత్వాస్పత్రి వైద్యులు అనిల్‌కుమార్ నాయక్ కోరారు. మండలంలోని చెన్నారెడ్డిపల్లె ఆరోగ్య ఉపకేంద్రంలో శనివారం వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ గ్రామాలలో చంటి పిల్లలకు, గర్భవతులకు, బాలింతలకు క్రమం తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ లక్ష్మినారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

వినాయకుని సేవలో ఆర్టీసీ చైర్మన్

కాణిపాకం (యాదమరి): శ్రీవరసిద్ధి వినాయక స్వామిని ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జున్ రెడ్డి శనివారం దర్శించుకున్నారు. దేవస్థానం చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేదపండితులు ఆశీర్వదించారు. తీర్థ ప్రసాదాలు అందించారు.



ఆలయంలో మల్లికార్జునరెడ్డి

స్వామివారి రథకలశం, బ్రహ్మ విగ్రహం, గొడుగును ఊరేగింపుగా తీసుకెళ్తున్న ఆలయ అధికారులు, గ్రామోత్సవంలో అధికారులు, ఉభయదారులు, వినాయకుని ఉత్సవ విగ్రహాలకు క్షీరాభిషేకం నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు







బ్రహ్మోత్సవం కళా నీరాజనం

సత్య ప్రమాణాల దేవుడు కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. శనివారం ఉదయం నుంచి ప్రత్యేక అభిషేక పూజలు అందుకున్న స్వామి వారు చిలుక వాహనంపై ఊరేగారు. రాతిర వృషభ వాహనంపై పురవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. కళాకారులు ఆధ్యాత్మిక కీర్తనలు ఆలపించారు. అద్భుత ప్రదర్శనలతో నాట్యాలు, నాటికలు ప్రదర్శించి, విఘ్ననాథునికి సాంస్కృతిక నీరాజనం సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి వాహన సేవలో పాల్గొని తరించారు.





కాణిపాకంలో సాంస్కృతిక కళా వేదికపై భక్తి గీతాలు ఆలపిస్తున్న చిన్నారులు, యాగశాలలో హోమం చేస్తున్న అర్చకులు

- వరసిద్ధునికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు
- చిలుక, వృషభ వాహనాలపై ఊరేగిన గణపయ్య
- రేపు రథోత్సవం

కాణిపాకం(యాదమరి): స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. స్వామి వారు రోజుకో వాహనంపై ఊరేగుతూ భక్తులకు అభయమిస్తున్నారు. బ్రహ్మోత్సవాల్లో శనివారం గణనాథుడు గ్రామ వీధుల్లో విహరించారు. ఉదయం అలంకార మండపంలో సిద్ధి, బుద్ధి సమేత వినాయక స్వామి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక అభిషేకాలు అలంకరణలు, పూజలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం ఉభయదారులు ఆలయ అధికారులు ఉత్సవమూర్తులను పురవీధుల్లో ఊరేగించి వేడుకగా గ్రామోత్సవం చేశారు. ఉదయం అలంకార మండపంలో సిద్ధి, బుద్ధి సమేత గణనాథుని అర్చకులు సుగంధపుష్పాలతో అలంకరించి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు, స్థానిక సర్పంచ్ శాంతిసాగర్ రెడ్డి, ఉత్సవ ఉభయదారులు పాల్గొన్నారు.

యాగమూర్తికి శాస్త్రోక్తంగా పూజలు

ఆలయంలో కొలువు తీర్చిన యాగమూర్తికి ఆలయ అర్చక, వేదపండితులు శనివారం ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

బ్రహ్మోత్సవాల్లో శనివారం ఆలయంలోని ఆస్థాన మండపంలో కళాకారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, భక్తి గీతాలు, నాటికలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

వినాయకుని సేవలో ప్రిన్సిపల్ సెక్రటరీ

వినాయక స్వామిని రాష్ట్ర దేవదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఐఏఎస్ కరికాల్ వలవెన్ శనివారం సాయంత్రం దర్శించుకున్నారు. స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలకు ఆయన కుటుంబ సమేతంగా విచ్చేశారు. వారికి ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి, ఆశీర్వాద మండపంలో వేదపండితులచే ఆశీర్వచనం అందించి స్వామివారి తీర్థ ప్రసాదాలు చిత్రపటం అందించారు. అనంతరం దేవదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆలయ మాడవీధులు, ఆలయ పరిసరాలు పరిశీలించి భక్తులకు అందిస్తున్న సౌకర్యాలను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాణిపాకం సర్పంచ్ శాంతిసాగర్ రెడ్డి, ఈఈ వెంకటనారాయణ, ఏఈఓ కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆలయ చైర్మన్, ఈఓ ఆస్థాన మండపంలో కళాకారులకు జ్ఞాపికలు అందించారు.

శాస్త్రోక్తంగా క్షీరాభిషేకం

వరసిద్ధి వినాయక స్వామి ఉత్సవ మూర్తులకు శాస్త్రోక్తంగా క్షీరాభిషేకం నిర్వహించారు. వృషభ వాహన ఉభయదారులు శాలివాహన వంశస్తులు స్వామివారి అనుబంధ ఆలయం నుంచి ఊరేగింపుగా క్షీర కలశాలను తీసుకొచ్చి అర్చకులకు అందించారు. వారు స్వామివారి అలంకార మండపంలో ఉత్సవమూర్తులకు క్షీరాభిషేకంతోపాటు ప్రత్యేక పూజలు చేసి భక్తులకు దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు, స్థానిక సర్పంచ్ శాంతిసాగర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు స్వామివారి రథోత్సవం

బ్రహ్మోత్సవాలలో సోమవారం స్వామివారి రథోత్సవం అంగరంగ వైభవంగా సాగనుంది. ప్రధాన ఆలయలోని మూషిక మండపంలో శనివారం ఉదయం రథానికి అలంకరించే కలశం, గొడుగు, బ్రహ్మ విగ్రహాన్ని కొలువు దీర్చి గణపతి పూజ, పుణ్యహవాచనం, అభిషేక పూజలు నిర్వహించి సంప్రోక్షణ పూజలను అర్చకులు నిర్వహించారు. అనంతరం మంగళవాయిద్యాలతో గ్రామ పురవీధులలో ఊరేగించి స్వామివారి రథంపై ప్రతిష్ఠించి పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు, స్థానిక సర్పంచ్ శాంతిసాగర్ రెడ్డి, ఉభయదారులు పాల్గొన్నారు. అంతక ముందు టింగ్ టింగ్ పిళ్లారప్ప(బలిహరణ)ను పురవీధుల్లో ఆలయ అర్చకులు ఊరేగించారు.









శివపార్వతుల వేషధారణలో నాట్యం చేస్తున్న కళాకారులు, వాహన సేవలో కళాకారుల కోలాటం, ప్రిన్సిపల్ సెక్రటరీ కుటుంబ సభ్యులకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు, నాటికను ప్రదర్శిస్తున్న కళాకారులు

నగదు రహిత లావాదేవీలు తప్పనిసరి

పూతలపట్టు: మండలంలోని గ్రామ సచివాలయాల్లో ఇకనుంచి నగదు రహితంగా డిజిటల్ రూపంలో పాలన ఉంటుందని ఎంపీడీఓ గౌరి అన్నారు. మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల్లో జరిగే లావాదేవీలను ఈ యాప్‌లో నమోదు చేయాలన్నారు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన లావాదేవీలను క్యూ ఆర్ స్కానర్ ద్వారా చెల్లించవచ్చని తెలిపారు. దీనిపై గ్రామంలోని ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. అనంతరం జగనన్న లేఅవుట్‌లలోని లబ్ధిదారులను ఇంకుడుగుంతలను నిర్మించుకునేలా వారితో మాట్లాడాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లోనే కాన్పులు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జార్జి

గుడిపాల: గ్రామీణల్లో అవగాహన పెంచి పీహెచ్‌సీల్లోనే కాన్పులు చేసుకునేలా చర్యలు తీసుకువాలని వైద్య ఆరోగ్యశాఖ స్టాటిస్టికల్ అధికారి జార్జ్ అన్నారు. శనివారం గుడిపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, స్టాఫ్ నర్సులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పీహెచ్‌సీల్లోనే కాన్పులను చేయాలని, అత్యవసర పరిస్థితుల్లోనే జిల్లా ఆస్పత్రికి రెఫర్ చేయాలని తెలిపారు. మండల జనాభా లెక్కలు, క్షేత్రస్థాయి సిబ్బంది రికార్డులను పరిశీలించారు. కుటుంబ నియంత్రణ ఆపరేషన్ మగవారికి కూడా చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. దీనిపై విస్తృతంగా అవగాహన కల్పించాలని తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష పథకం కింద ఇంటింటికీ వెళ్లి వైద్య సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి హరి, సీహెచ్‌ఓ నరసింహమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

కనుల పండువలా ఇంద్రవరదుని కల్యాణం



ప్రత్యేక అలంకరణలో స్వామి అమ్మవార్లు

యాదమరి: మండల కేంద్రంలో వెలసిన ఇంద్రవరదుని కల్యాణోత్సవం కనుల పండువలా నిర్వహించారు. పెరటాసి నెల మొదటి శనివారం కావడంతో ఆలయంలో వెలసిన మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు చేసి, భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయంలోని కల్యాణ వేదికలో శ్రీదేవి, భూదేవి సమేత ఇంద్రవరదుని వధూవరులుగా అలంకరించి, కొలువుదీర్చారు. వేద మంత్రాల మధ్య స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని కనులవిందుగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

త్వరలో సచివాలయాల్లో నోటరీ సేవలు



పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: ప్రజల సౌకర్యార్థం వార్డు సచివాలయాల్లో నోటరీ సేవలను తీసుకొచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు సిద్ధం చేస్తోందని, త్వరలోనే ఈ సేవలు ప్రజలకు అందుబాటులోకి రానున్నాయని చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అరుణ చెప్పారు. కమిషనర్ గాయత్రీ నగర్‌లోని డివిజన్ సచివాలయంలో నోటరీ సర్వీసులకు సంబంధించిన ఏర్పాట్లను శనివారం సాయంత్రం పరిశీలించి, వార్డు కార్యదర్శులతో సమీక్షించారు. కమిషనర్ మాట్లాడుతూ సచివాలయాల్లో కొన్ని పౌర సేవల కోసం వ్యక్తిగత ధ్రువీకరణ పత్రాలతోపాటు నోటరీ ద్వారా అఫిడవిట్ సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఇందుకోసం ప్రజలు మరో చోటకు వెళ్లాల్సి ఉంటుందని, ఇకపై ఇలాంటి శ్రమకు అవకాశం లేకుండా ప్రభుత్వం సచివాలయాల్లోనే నోటరీ సేవలను అందుబాటులోకి తెస్తున్నట్లు చెప్పారు. చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని కట్టమంచి, ఎస్ఎస్ పురం, మసీదు మిట్ట, గాయత్రి నగర్, లాలూ గార్డెన్-01, రాం నగర్ కాలనీ, రంగాచారి వీధి, అరగొండ రోడ్డులోని ఏడు నోడల్ సచివాలయాల్లో ఈ సేవలు అందుబాటులోకి రానున్నాయని వివరించారు. ఇందుకోసం నోటరీలను ప్రభుత్వం నోడల్ సచివాలయాలకు త్వరలోనే కేటాయించనున్నట్లు వివరించారు. సచివాలయం పరిధిలో సంక్షేమ పథకాల అమలు తీరుపై వార్డు కార్యదర్శులతో సమీక్షించారు. రికార్డులను, సంక్షేమ క్యాలెండర్, నోటీస్ బోర్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ కుట్టి రాయల్, సీఎంఎం గోపి తదితరులు పాల్గొన్నారు.

నాగయ్య కళాక్షేత్రంలో సెంట్రలైజ్డ్ ఏసీ

చిత్తూరు నగరంలోని నాగయ్య కళాక్షేత్రంలో పాడైన ఎయిర్ కండీషనర్ల స్థానంలో సెంట్రలైజ్డ్ ఏసీ ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు శనివారం మునిసిపల్ కార్యాలయంలో నిర్వహించిన కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ సమావేశంలో తీర్మానించారు. నగర మేయర్ ఎస్ అముద, కమిషనర్ అరుణ, స్టాండింగ్ కమిటీ సభ్యులు, డిప్యూటీ మేయర్ ఆర్ చంద్రశేఖర్, సి శోభ, బి.పూర్ణచంద్ర రావు సమావేశానికి హాజరయ్యారు. స్టాండింగ్ కమిటీ సమావేశంలో పలు అభివృద్ధి, మరమ్మతు పనులను ఆమోదించారు. నాగయ్య కళాక్షేత్రంలో ఏసీతోపాటు ఇతర మరమ్మతులకు 2023–24 బడ్జెట్ సాధారణ నిధులు వ్యయం చేయడానికి టెండర్లు నిర్వహించాలని స్టాండింగ్ కమిటీ ఆమోదించింది. నగరంలోని దర్గా కూడలిలో ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటుకు కమిటీ ఆమోద ముద్ర వేసింది. సమావేశంలో మునిసిపల్ ఇంజనీరు గోమతి, ప్రజారోగ్యశాఖ అధికారి డాక్టర్ లోకేష్, మేనేజర్ తనూజ, డీఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఏఈలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల తనిఖీలు

నగరంలోని గాయత్రి నగర్ పరిధిలో పారిశుద్ధ్య పనులను కమిషనర్ అరుణ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వీధుల్లో తిరుగుతూ పారిశుద్ధ్య పనులు, మురుగు నీటి కాలువల్లో పూడికతీత పనులను తనిఖీ చేశారు. వర్షాలు పడుతుండడంతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మురుగునీటి కాలువలు శుభ్రంగా ఉండాలని, ఎప్పటికప్పుడు పూడిక, వ్యర్థాలను తొలగించి నీరు నిలవకుండా చూడాలన్నారు. వీధుల్లో ఎక్కడ వ్యర్థాలు కనిపించకూడదన్నారు. కమిషనర్ వెంట స్థానిక కార్పొరేటర్ కుట్టి రాయల్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిన్నయ్య, సీఎంఎం గోపి పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



పౌష్టికాహార మాసోత్సవాల్లో అంగన్‌వాడీ సిబ్బంది, గర్భిణులు

గుడిపాల: సంపూర్ణ ఆరోగ్యం పౌష్టికాహారంతో సాధ్యమవుతుందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ స్వర్ణలత అన్నారు. మండలంలోని తిమ్మాపల్లె అంగన్‌వాడీ సెంటర్లో శనివారం పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నాణ్యమైన పౌష్టికాహారం ప్రతి తల్లీబిడ్డకు అందాలని, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ఆరోగ్యంగా ఉండాలన్నారు. జంక్‌ఫుడ్ పట్ల ఆకర్షితులైన యువత ఆరోగ్యాన్ని పాడుచేసుకుంటోందని, బజారులో దొరికే ఆహారానికి దూరంగా ఉండాలన్నారు. పౌష్టికాహార ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన కల్పించడం కోసమే ఈ వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ వాసంతి, రోస్లి, రేఖ, వైద్యసిబ్బంది నిష, వనజ, రాధ పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదాతలు కండి



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ ప్రభావతీ దేవి

బంగారుపాళెం: రక్తదానంతో ప్రాణదాతలు కావాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ ప్రభావతి అన్నారు. మండలంలోని తగ్గువారిపల్లెలో శనివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. యువకులు పెద్ద సంఖ్యలో రక్తదానం చేసేందుకు ముందుకు వచ్చారు. ఆమె మాట్లాడుతూ, ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడిన వారికి, ప్రాణాపాయ జబ్బులతో బాధపడుతున్న వారికి రక్తం చాలా అవసరం ఉంటుందన్నారు. అలాంటి వారికి రక్తం అందించేందుకు ఇలాంటి శిబిరాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆరోగ్యంగా ఉన్న వ్యక్తి ఎన్ని సార్లయినా రక్తదానం చేయవచ్చన్నారు. ఎటువంటి సమస్యలూ ఉండవన్నారు. రక్తదానం చేసిన 80 మందికి సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐ నాగరాజరావు, డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల రక్తదానం

చిత్తూరు రూరల్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వేడుకలను పురస్కరించుకుని చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో శనివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ప్రధానమంత్రి చేస్తున్న సేవలను నాయకులు కొనియాడారు. నాయకులు జగదీష్‌నాయుడు, దామోదర్‌రెడ్డి, శివరాయల్, శ్రీనివాస్, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ పోటీలకు 120 మంది ఎంపిక



నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన బాలికలు

యాదమరి: మండల పరిధిలోని పాఠశాలల విద్యార్థులకు పలు రకాల క్రీడా పోటీలు(స్కూల్ గేమ్స్) నిర్వహించారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో శనివారం ఉదయం నిర్వహించిన ఈ పోటీలకు 200 మంది విద్యార్థులు హాజరయ్యారు. అండర్ 17, అండర్ 14 విభాగాలలో వాలీబాల్, త్రోబాల్, టెన్నికాయిట్, కబడ్డీ, ఖోఖో గేమ్స్ నిర్వహించారు. ఈ పోటీలలో అండర్ 17 వాలీబాల్ విన్నర్‌గా యాదమరి ఉన్నత పాఠశాల, రన్నర్స్‌గా 14 కండ్రిగ ముస్లింవాడ ఉర్దూ పాఠశాల విద్యార్థులు నిలిచారు. బాలికల విభాగంలో 14 కండ్రిగ ముస్లింవాడ ఉర్దూ పాఠశాల విద్యార్థులు విజేతలుగా, యాదమరి ఉన్నత పాఠశాల విద్యార్థులు రన్నర్‌గా నిలిచారు. అండర్ 17, 14 బాల బాలికల త్రోబాల్ పోటీలలో యాదమరి విద్యార్థులు విన్నర్‌గాను, గుడ్‌షెపర్డ్, 14 కండ్రిగ ముస్లింవాడ విద్యార్థులు రన్నర్‌గాను నిలిచారు. ఈ పోటీలలో వివిధ క్రీడలలో విశేష ప్రతిభ కనభరచిన 120 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. వీరు పూతలపట్టులో నిర్వహించే నియోజకవర్గ స్థాయి క్రీడలలో పాల్గొనున్నట్లు హెచ్‌ఎం గిరిరాజ తెలిపారు. ఈ కార్యక్రమంలో పీడీలు రవి, దాము, హరికృష్ణ, సిరాజ్, అహ్మద్, మాధవి, చిట్టిబాబు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.